క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలిపారు. పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, విష్ణుపురం కాలనీ, వసంతనగర్, బందర్ రోడ్డు, గద్దె ఆర్‌టీసీ కాలనీ, బ్రహ్మంగారి గుడి ప్రాంతం, రంగా బొమ్మ సెంటర్ శ్రీనివాసానగర్, సీతాపురం కాలనీ, సాలిపేట, పెనమలూరుసెంటర్, రామాపురంకాలనీ, డొంక రోడ్డు, కరణంగారి బజార్, ప్రభునగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కంకిపాడు: కంకిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుణదల ఈఈ పి.హరిబాబు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ మార్పు, సబ్‌స్టేషన్ మరమ్మతుల నిర్వహణ చేపడుతున్నారన్నారు. కంకిపాడు, పునాదిపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ పోటీలకు ఎంపిక

పెనమలూరు: జాతీయ వాటర్ పోలో పోటీలకు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు తిరువనంతపురంలో జరగనున్న 77వ సీనియర్ జాతీయ స్థాయి ఆక్వాటిక్ జాతీయ పోటీలకు తమ కాలేజీకి చెందిన విద్యార్థులు దేవిదుర్గ, మోనిక ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్, ఐటీ విభాగాధిపతి సునీత అభినందించారు.

మినుము పైరు పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: వర్షాలు, బుడమేరు వరద ముంపు కారణంగా దెబ్బతిన్న వరి, మినుము పంట నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు ఎంఏవో జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం సింగన్నగూడెంలో మినుమ పంటను శుక్రవారం ఆమె పరిశీలించారు. మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో మినుము పంటకు నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు. రంగన్నగూడెం, సింగన్నగూడెం, మల్లవల్లి, రేమల్లే గ్రామాల్లో నష్టాన్ని చవిచూశారన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లిలో శుక్రవారంఎంఏవో తేజశ్వి పర్యటించిదెబ్బతిన్న పంటలు పరిశీలించారు. రైతులు ఇటీవలవర్షాలకు పత్తి పంటలు దెబ్బ తిన్నాయని ఆమె దృష్టికి తేవడంతో పంటలు పరిశీలించారు. వీఏఏలు కౌశిక్, నరేంద్ర పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందాలి

కంకిపాడు: వరదలు, భారీ వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని సమర్థంగా నమోదు చేయాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. శాఖల వారీగా పనితీరు, ప్రగతి నివేదికలపై సమీక్షించారు. ఈ సందర్భంగాఎంపీపీనెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వరదలు, వర్షాలతో వరి, చెరకు, కంద, పసుపు, తమలపాకు, కూరగాయలు, ఇతర పంటలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టం నమోదును ఉద్యానశాఖ, వ్యవసాయశాఖలుసమర్థంగా చేపట్టాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకీ పరి హారం అందేలా పనిచేయాలన్నారు. ఉపాధి పనుల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ పి.అనూష, పరిపాలనాధికారి ఉదయభాస్కర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు శివాలయం పల్లాల్లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో రూ.1.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేసిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యలమంచిలి నుంచి సుమారు 8 సంవత్సరాల క్రితం వలసొచ్చిన నానేపల్లి బాబ్జి, వరలక్ష్మి దంపతులు గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బాబ్జి ముఠా పని చేస్తుండగా, వరలక్ష్మి కొత్త ఆటోనగర్‌లో ఓ కంపెనీలో కూలీ పనులకు వెళ్లుతుంది. రోజులాగే ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయారు. విధులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన రమాదేవి తాళాలు విరగ్గొట్టి ఉండటం గమనించింది. బీరువామ్యాటీలు, దిద్దులు, పోగులు చోరీకి గురవగా భర్త బాబ్జికి చెప్పింది. తన షర్ట్ జేబులో ఉంచిన రూ.5 వేలు పరిశీలించగా భద్రంగానే ఉన్నాయి. బంగారం మాత్రమే చోరీ చేశారని బాధితులు తెలిపారు. పటమట పోలీసులకు సమాచారం ఇవ్వగా పరిశీలించి వివరాలు సేకరించారు.

వేర్వేరు చోట్ల చోరీలు..

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక వైఎస్సార్ జగనన్న కాలనీలో తాపీమేస్త్రి ఆలూ రి రమేష్, భార్యతో కలిసి శుక్రవారం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లాడు. రాత్రి వచ్చేసరికి తలుపులు తాళం పగలు కొట్టి ఉన్నాయి. బీరువాలో రూ.లక్ష బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. రమేష్ హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. బాపులపాడుకు చెందిన కాకుల శ్రీనివాసరావు పొలంలో వ్యవసాయ విద్యుత్ మోటారు ధ్వంసం చేసి రాగి తీగను అపహరించారు. హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆఖరి మజిలీలోనూ అవస్థలే!


శ్మశానం మొత్తం పేరుకుపోయిన ముళ్లకంపలు, పిచ్చి చెట్లు


దుర్గంధం భరించలేక ముక్కుమూసుకుని అంత్యక్రియలు నిర్వహించుకుంటున్న క్రైస్తవులు (ఫైల్)

- అధ్వానంగా శ్మశానవాటిక
- ముళ్లకంపలు, పిచ్చిచెట్లతో అల్లుకుపోయిన శ్మశానం
- శ్మశానం చుట్టూ చెత్త డంపింగ్
- ముక్కుమూసుకుని అంత్యక్రియలు
- రెండు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

రామవరప్పాడు: నగరానికి ఆనుకుని ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడులోని ఎస్సీ శ్మశానవాటిక అపరిశుభ్రతకు నిలయంగా ఉంది. నగరం నుంచి ఈ గ్రామానికి వలస వచ్చే వారి సంఖ్య క్రమేణా పెరుగుతున్నా ఈ శ్మశానవాటిక మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామంలోని బల్లెంవారి వీధిలో ప్రధాన రహదారికి ఆనుకుని ఈ శ్మశానవాటిక ఉంది. విజయవాడ రూరల్ మండలంలో జంట గ్రామాలుగా పేరు తెచ్చుకున్న రామవరప్పాడు, ప్రసాదంపాడులకు ఉన్న ఒకే ఒక్క ఎస్సీ శ్మశానవాటిక ఇది. ఈ రెండు గ్రామాల్లో కలిపి వేల సంఖ్యలో ఎస్సీలు ఈ శ్మశానంపైన ఆధారపడి ఉన్నారు. ఈ శ్మశానం బాగోగులు ఎవ్వరికి పట్టకపోవడంతో అఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేదు.

శ్మశానంలో పేరుకుపోయిన ముళ్ల చెట్లు

ఈ శ్మశానం మొత్తం ముళ్ల కంపలు, పిచ్చి చెట్లతో నిండిపోయింది. కనీసం కాలు తీసి కాలు వేయలేనంతగా అధ్వానంగా మారింది. అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నామని ముళ్ల చెట్లు తొలగించి, చుట్టూ ప్రహరీ నిర్మించాలని పలుమార్లు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ పట్టించుకోవడం లేదని ఇరు గ్రామ ప్రజలు తమ బాధలు వ్యక్తం చేస్తున్నారు. సమాధులు నిర్మించుకునేందుకు కూడా వీలు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

దుర్గంధం భరించలేక..

శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోవడం లేదన్న బాధలు ఒక వైపు, చెత్త డంపింగ్ సమస్య మరో వైపు క్రైస్తవులను పట్టి పీడిస్తోంది. రామవరప్పాడు పంచాయతీ ఆధ్వర్యంలో నిత్యం ఈ శ్మశానవాటిక చుట్టూ చెత్తను డంప్ చేస్తున్నారు. గ్రామంలోని చెత్తనంతటినీ ట్రాక్టర్లతో తీసుకొచ్చి శ్మశానంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా కుప్పలుగా పోస్తున్నారు.

గతంలో ఆందోళనలు..

గతంలో ఈ శ్మశానవాటిక వద్ద చెత్త డంప్ చేయొద్దని ఆందోళనలు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒక పక్క కుప్పలుగా పేరుకుపోతున్న చెత్త, మరో వైపు కుళ్లిన వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా అంత్యక్రియలు నిర్వహించడానికి వచ్చిన వారు ముక్కు మూసుకుని అంత్యక్రియలు ముగించాల్సిన పరిస్థితి నెలకొంది.

స్పందించాలని వినతి..

వర్షాకాలంలోనైతే వీరి బాధలు వర్ణనాతీతం. మట్టి చేయడానికి వచ్చిన వారు చెత్త, బురదలోనే పట్టాలు పరుచుకుని అఖరి మజిలీ పూర్తి చేసుకుంటున్నారు. రామవరప్పాడులో అభివృద్ధి పరిచిన హిందూ శ్మశానవాటికను దృష్టిలో ఉంచుకుని ఈ శ్మశానవాటికను కూడా అభివృద్ధి పరచాలని ఇరు గ్రామ ప్రజలు అధికారులు, పాలకులను కోరుతున్నారు.

వైభవంగా గణేష్ నవరాత్రులు


పోరంకి యాదవుల బజార్‌లో వినాయకుడు


ఆలయ చిత్రపటం స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్

కంకిపాడు: గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఈడుపుగల్లు గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీ కాలనీలో యువత ఏర్పాటుచేసిన చలువ పందిరిని మాజీ ఎంపీపీ దేవినేని రాజా సందర్శించి పూజా కార్యక్రమాలు జరిపించారు. అన్నసంతర్పణను ప్రారంభించారు.

పెనమలూరు: పోరంకి గ్రామంలో గంగానమ్మ గుడి వద్ద శుక్రవారం శ్రీరుద్ర సంయుక్త శ్రీవారాహి చండీహోమం వైభవంగా నిర్వహించారు. శివసతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. దంపతులు చండీహోమంలో పాల్గొన్నారు. శనివారం అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అన్న సమారాధన

పోరంకి యాదవుల బజార్‌లో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా చేస్తున్నారు. శుక్రవారం భక్తులను అన్నసమారాధన నిర్వహించారు. వినాయకుడికి ఎమ్మెల్యే బోడెప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు పూజలు చేశారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఆలయ ఫొటో బహూకరించి సత్కరించారు.

చినకంచిలో..

నున్న(విజయవాడరూరల్): శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం చినకంచిలో గణపతి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం భాద్రపదం మాసాన్ని పురస్కరించుకొని శ్రీచక్రనవావర్చన పూజా కార్యక్రమం జరిగింది. ముత్తయిదవులచే కుంకుమపూజ, బాలపూజ, సుహాసిని పూజా కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు. ఆదివారం స్వామివారికి లక్షగరిక పూజ జరుగుతుంది. అదే రోజు గణపతి పూజ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని దేవ స్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ విజ్ఞప్తి చేశారు.

ఉయ్యూరు: వాడవాడలా కొలువుదీరిన గణనాథుడికి భక్తజనం శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఉయ్యూరు చింతలతోటలో భారీ గణనాథుడిని భక్తులు వేలాదిగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వినాయకుడిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు చేయించారు. భక్తుల అన్నసంతర్పణను ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐదు వేల మందికి అన్నసంతర్పణ చేశారు. సుందరంపేట, కొబ్బరితోట, బస్టాండు సెంటరు ప్రాంతాల్లో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజి గూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సువాసినిలు సామూహిక కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, పలువురు గ్రామ ప్రముఖులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


పోరంకి గంగానమ్మ గుడి వద్ద చండీహోమం


ఈడుపుగల్లు బీసీ కాలనీలో భక్తులు


ఈడుపుగల్లులో అన్నదానం


ఉయ్యూరు గణేష్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్


చింతలతోటలో గణేష్ ఉత్సవాల్లో యువత


దావాజిగూడెంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

మార్కెట్‌లోకి సరికొత్త అల్కాజర్



అల్కాజర్ కారును నగర మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న శ్రీనివాస్, ధీరజ్ తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని సాయి స్వర్ణ హ్యుండాయ్ షోరూమ్‌లో శుక్రవారం హ్యుండాయ్ కొత్త అల్కాజర్ కారును సుందరం ఫైనాన్స్ మేనేజర్ శ్రీనివాస్, హెచ్ఎంఐఎల్ టీఎస్ఎం ధీరజ్ నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి స్వర్ణ జనరల్ మేనేజర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ ఈ నూతన అల్కాజర్ కారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుందన్నారు. 1.5 టర్బో జీడీఐ పెట్రోల్ ఇంజిన్, 18 ఇంచ్ డైమండ్ కట్ అలాయ్స్ వీల్స్, అడ్వాన్స్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్, 70 ప్లస్ స్టాండర్డ్ సెఫ్టీ ఫ్యూచర్స్, ఆకర్షణీయమైన మోనోటోన్ డ్యూయల్ టోన్ రంగుల్లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ అల్కాజర్ కారు ధర రూ.14.99 లక్షల నుంచి ప్రారంభమవుతుందని వివరించారు. వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

నగర మార్కెట్‌లోకి మహీంద్ర థార్ రాక్స్



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని ఆటోమోటీవ్ మ్యానుఫ్యాక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూమ్‌లో సరి కొత్త 'మహీంద్ర థార్ రాక్స్' కారును శుక్రవారం గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మహీంద్ర ఏఎస్ఎం అజయ్, సీఓ సంతోష్ కుమార్ సంయుక్తంగా నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా జనరల్ మెనేజర్ మణి మాట్లాడుతూ ఎస్‌యూవీ శ్రేణిలో ప్రవేశపెట్టిన థార్ రాక్స్ కారు పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో లభిస్తుందన్నారు. 6 స్పీడ్ మ్యానువల్, 6 స్పీడ్ ఆటోమోటిక్ ట్రాన్స్‌మిషన్లలో వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈ కారులో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇనుమడిం పజేశారన్నారు. కారు ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర రూ.12.99 లక్షలుగా ఉన్నట్లు పేర్కొన్నారు. కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ మెనేజర్ లక్ష్మీప్రియ, షోరూమ్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం అభినందనీయం


బాధితులకు వంట సామగ్రి అందజేస్తున్న ఆర్డీవో రాజు, ఏపీ బహుజన జేఏసీ ప్రతినిధులు

కంకిపాడు: వరద ముంపు బాధితులకు ఆపన్నహస్తం అందించటం అభినందనీయమని ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు అన్నారు. ఏపీ బహుజన జేఏసీ భీమవరం ఆధ్వర్యంలో తెన్నేరు, మంతెన గ్రామాల్లో వరద ముంపుతో నష్టపోయిన కుటుంబాలకు వంట సామగ్రిని శుక్రవారం ఆర్డీవో డి.రాజు బాధిత కుటుంబాలకు సామగ్రి అందించారు. ఆయన మాట్లాడుతూ బహుజన జేఏసీ సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భావన్నారాయణ, సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా, ఏపీ బహుజన జేఏసీ ఫౌండర్, మరియు కన్వీనర్ తాళ్లూరి మధు, గౌరవ అధ్యక్షుడు కాటన్ స్టాన్లీ రాజు, ఉపాధ్యక్షుడు బిరుదుగడ్డ రమేష్‌బాబు, ముఖ్యసలహాదారు పిల్లా శ్రీను, న్యాయ సలహాదారు బడుగు అశోక్‌బాబు, మానిటరింగ్ మహిళా అధ్యక్షురాలు పాలవెల్లి మంగ, కోఆర్డినేటర్ గరికిముక్కు మేరీ అలీషా, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిగురుపాటి రాహేలు, కాళ్ల మండలం కన్వీనర్ బోడిగడ్డ యెహోషువ, ప్రతినిధులు ముత్యం కిషోర్, పుచ్చకాయల నారాయణ, కెనడీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్

నున్న(విజయవాడరూరల్):వరదల నేపథ్యంలో శుభ్రమైన తాగునీరు సరఫరా చేసేందుకు నున్న గ్రామంలో శుక్రవారంతాగెనీటి ట్యాంకులను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు ఐదు, మినీ ట్యాంకులు 26 వుండగా బ్లీచింగ్‌తో శుభ్రం చేసి అనంతరం క్లోరినేషన్ చేశామని కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు.

ఏచూరి జీవితం యువతకు స్ఫూర్తి


ఉయ్యూరులో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు


తాడిగడపలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ఉయ్యూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ప్రజలకు తీరని లోటని ఉయ్యూరు విశ్రాంత ఎంఈఓ కొలుసు విశ్వమోహన్ అన్నారు. ఉయ్యూరులో శుక్రవారం శ్రామిక భవన్‌లో సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వమోహన్ మాట్లాడుతూ సిద్ధాంత కర్త ఏచూరి మరణం బాధాకరమన్నారు. నేటి తరానికి ఏచూరి జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నం భాస్కర్‌రావు, కోసూరు శివనాగేంద్రం, రాజేష్, అన్నే సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి మండల సీపీఎం, అనుబంధ సంస్థల నేతలు నివాళులర్పించారు. తాడిగడపలో సీపీఎం మండల పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ పేద ప్రజలకోసం ప్రజాఉద్యమాలు, రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆన మరణం సమాజానికి పెద్దలోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు షేక్ మస్తాన్‌వలి, నారిన వెంకట్రావు, సీఐటీయూ, మహిళా సంఘాలు, డీవైఎఫ్ఐ యువజన సంఘం, పలు ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి మృతి తీరని లోటని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. బాపులపాడు మండలం బండారుగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి శుక్రవారం నివాళి అర్పించారు. గ్రామంలోని సీపీఎం జెండా దిమ్మె వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహర్లు పలికారు. సీపీఎం నాయకులు బర్రె లెనిన్, బొకినాల రాము, పామర్తి అప్పయ్య పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం సంస్మరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పార్టీ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, పలువురు సీనియర్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దు మాట్లాడుతూ..ఏచూరి అకాల మరణం కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని చెప్పారు. పార్టీ నేతలు పెద్దు వెంకటరత్నం, ముక్కమల ఉమామహేశ్వరరావు, కాట్రగడ్డ జోషి, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: ఉద్యమస్ఫూర్తి సీతారాం ఏచూరి అని వక్తలు కొనియాడారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ శుక్రవారం స్థానిక మండేపూడి భవన్‌లో నిర్వహించారు. కమిటీ సభ్యుడు సీహెచ్ శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పంచకర్ల రంగారావు ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక కర్షక లోకానికి ఏచూరి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. ఆయన జీవితాన్ని నేటి తరం నేతలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు వి.శివశంకర్, పి.దుర్గారావు, జి.కుమారి, ఎం.చంటి, ఎం.శ్రీనివాసరావు, జె.రవి, వి.మరియదాసు, వై.జోజి, వి.నాగేశ్వరరావు, సీహెచ్ రెడ్డియ్య, సీపీఐ జిల్లా నేత వెలగపూడి ఆజాద్ పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక చింతపల్లి పాపారావు స్మారక భవనంలో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, సీపీఎం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పార్టీ నేతలు కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, మిరప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: వామపక్ష ఉద్యమనేత కామ్రేడ్ సీతారామ్ ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.సూర్యారావు అన్నారు. యనమలకుదురు గ్రామంలో శుక్రవారం సీపీఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ ఏచూరి సంతాపసభ నిర్వహించారు. ఈ సభలో సూర్యారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సీతారామ్ ఏచూరి ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. సీతారామ్ ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. సీపీఎం నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్ కాశిం, మస్తాన్‌వలి, మాధవ, ఎస్‌కే. బాబు, పాతాళలక్ష్మి పాల్గొన్నారు.


యనమలకుదురులో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూర్యారావు


కంకిపాడులో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

లోకాయుక్త చీఫ్ జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి సత్కారం


లక్ష్మణ్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న సామాజిక కార్యకర్తలు

ఉయ్యూరు: లోకాయుక్త చీఫ్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డిని కృష్ణా జిల్లా సామాజిక కార్యకర్తలు శుక్రవారం కలిశారు. కర్నూలులో లోకాయుక్త ఆవరణలో నిర్వహించిన పదవీవిరమణ సభకు సామాజిక కార్యకర్తలు జంపాన శ్రీనివాసగౌడ్, దుర్గాప్రసాద్, తదితరులు లక్ష్మణ్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఆర్‌టీఐ క్యాంపెయిన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ లోకాయుక్త ద్వారా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎంతో మంది పేదలకు మేలుజరిగిందన్నారు. అన్యాయాలను ప్రశ్నిస్తూ సామాజిక కార్యకర్తలు చేసిన న్యాయ పోరాటానికి లోకాయుక్తలో న్యాయం దక్కిందన్నారు. లక్ష్మణ్‌రెడ్డి వంటి ఉన్నత భావాలు గల వ్యక్తులు న్యాయ సమాజానికి అవసరమన్నారు.